గుర్రంపై సవారీ కలేనా..?

- మధ్యలోనే నిలిచిపోయిన గుర్రపు స్వారీ శిక్షణ కేంద్ర నిర్మాణం
- ముడసర్లోవ రోజ్ పార్క్‌లో శ్రీకారం చుట్టిన జీవీఎంసీ
- గుర్రాల కోసం ప్రత్యేకంగా షెల్టర్లు, రింగ్‌ల నిర్మాణం
- అందుబాటులోకి తేవాలని స్థానికుల విజ్ఞప్తి





ముడసర్లోవ రోజ్ పార్కులో జీవీఎంసీ నిర్మించిన గుర్రాల షెల్టర్లు

ఆరిలోవ: ముడసర్లోవ పార్కులో జీవీఎంసీ తలపెట్టిన గుర్రపు స్వారీ శిక్షణ మధ్యలో నిలిచిపోయింది. పార్కు సముదాయంలోని మూడు ఎకరాల విస్తీర్ణం గల రోజ్ పార్కులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గుర్రాల స్వారీ కేంద్రం నిర్మాణానికి జీవీఎంసీ అధికారులు సన్నాహాలు చేపట్టారు. దీని కోసం రూ.9 కోట్లు నిధులు కేటాయించి పనులు మొదలుపెట్టారు. నాటి నుంచి చకచకా జరుగుతున్న పనులకు కొద్ది నెలల కిందట బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం శిక్షణ కేంద్రం నిర్మాణ పనులను నిలిపేశారు. ఆరిలోవ ప్రాంతంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టి నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులు అన్నింటినీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆపేయడం విశేషం. పెదగదిలి నుంచి తోటగరువు వరకు, తోటగరువు నుంచి అంబేడ్కర్ కూడలి వరకు, అంబేడ్కర్ కూడలి నుంచి పార్వతీనగర్ కొత్త బ్రిడ్జి వరకు అప్పట్లో సుమారు రూ.7.50 కోట్లతో చేపట్టిన రోడ్ల నిర్మాణం పనులు మధ్యలో నిలిపేసిన విషయం తెలిసిందే. దీంతోపాటు ఈ పార్కులో పర్యాటకులకు వినోదం కోసం ఏర్పాటు చేయదలచిన గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రాన్ని సైతం మధ్యలోనే ఆపేశారు. విదేశాల్లో పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తున్న ఇలాంటి శిక్షణపై ప్రస్తుత పాలకులు చిరుకన్ను వేయడంపై స్థానికులు మండిపడుతున్నారు.

మూడు ఎకరాలు.. రూ.9 కోట్లు

ముడసర్లోవ పార్కులో సుమారు మూడెకరాల విస్తీర్ణంలో రోజ్ పార్కు ఉంది. ఇది గతంలో పిక్నిక్‌లకు అనుకూలంగా ఉండేది. దీనిలో జీవీఎంసీ అధికారులు గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.9 కోట్ల నిధులతో ఈ ఏడాది జనవరిలో పనులు ప్రారంభించి చకచకా చేపట్టారు. జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులను అధికారులు అర్థాంతరంగా నిలిపేశారు. అప్పటికే ఇక్కడ సుమారు 50 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలినవి మధ్యలోనే ఆపేయడంతో గుర్రపు స్వారీ శిక్షణ కేంద్ర నిర్మాణం ఆగిపోయినట్లేనని స్థానికుల్లో అనుమానాలు కలుగుతున్నాయి.



గుర్రాలు స్వారీ చేయాల్సిన రింగులు

సగంలోనే నిలిచిన నిర్మాణాలు

ఈ కేంద్రంలో కొన్ని మేలు జాతి గుర్రాలు అందుబాటులో ఉంటాయి. వాటి కోసం ప్రత్యేకంగా ఓ షెల్టర్ నిర్మించారు. దానిలో ఒక్కో గుర్రం విశ్రాంతి కోసం ఒక్కో గదిని ఏర్పాటు చేశారు. ఇక్కడ శిక్షణ పొందదలచిన వారికి ఆ గుర్రాలపై ఎక్కి స్వారీ చేయడం నేర్పుతారు. స్వారీ చేయడానికి వీలుగా ప్రత్యేకంగా ఇక్కడ రెండు పెద్ద రింగులు ఏర్పాటు చేశారు. స్వారీ చేస్తున్న వారిని చూడడానికి సందర్శకుల కోసం గ్యాలరీలు నిర్మిస్తున్నారు. అవన్నీ సగం పనులతో నిలిచిపోయాయి. దీంతో రింగులు, గ్యాలరీల పనులు పూర్తికాక అస్తవ్యస్తంగా మారాయి. ఇప్పటి వరకు జీవీఎంసీ ఖర్చు చేసిన నిధులు బూడిదలో పోసిన పన్నీరుగా మిగిలాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అభివృద్ధి పనులకు ఆటంకం కాకూడదని హితవు పలుకుతున్నారు. జీవీఎంసీ అధికారులు ప్రజాధనం వృథా చేయకుండా గుర్రాల స్వారీ శిక్షణ కేంద్రం పనులు పూర్తి చేయాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.



మధ్యలో ఆగిపోయిన సందర్శకుల గ్యాలరీ నిర్మాణం

క్లుప్తంగా

బయో కెమికల్ ఎనలైజర్ వితరణ



పరికరం అందుకుంటున్న ఈఎన్‌టీ ఆస్పత్రి సూపరింటెండెంట్ హరికృష్ణ

బీచ్‌రోడ్డు: కనీస రక్త పరీక్షలకు నోచుకోని ఈఎన్‌టీ ఆస్పత్రికి ఇక నుంచి ఆ సమస్య తీరనుంది. రక్త పరీక్షలు చేసే బయో కెమికల్ ఎనలైజర్‌ను ఆంధ్రా మెడికల్ కాలేజ్ 1993 బ్యాచ్ విద్యార్థులు ఈఎన్‌టీ ఆస్పత్రికి వితరణ చేశారు. ఈ మేరకు శనివారం 1993 బ్యాచ్ తరఫున డాక్టర్ వరప్రసాద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు చేతుల మీదుగా ఈఎన్‌టీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణకు పరికరాన్ని అందజేశారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు



సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మద్దిలపాలెం: సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా శనివారం కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో కొలువైన శివలింగం, నాగదేవత సహిత సుబ్రహ్మణ్య స్వామికి తెల్లవారుజాము 2.30 గంటల నుంచి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, బాల భాస్కరశర్మ భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు మద్దాల వీర వెంకట అప్పారావు ఆధ్వర్యంలో భక్తులకు, అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కుమారుడు వెలగపూడి ప్రతాప్ రుద్ర పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని వినతి



కేంద్ర మంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందిస్తున్న లగుడు గోవిందరావు

ఏయూక్యాంపస్: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు–అనే ప్రజా నినాదంతో ఏర్పడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని విరమించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమార స్వామిని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. శనివారం న్యూఢిల్లీలో మంత్రిని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలని, విశాఖ రైల్వే జోన్ నిర్మాణ ప్రక్రియ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విశాఖలో మెట్రోరైల్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని, పరిశ్రమల్లో 371డీ ప్రకారం స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు కల్పించాలని కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు గోవింద్ తెలిపారు.

మహిళా ప్రాంగణం సందర్శన

ఆరిలోవ: ఏపీ మహిళా కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కావలి గ్రీష్మ శనివారం పైనాపిల్ కాలనీలోని జిల్లా మహిళా ప్రాంగణాన్ని సందర్శించారు. ఇక్కడ మహిళల కోసం జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. ఎలాంటి శిక్షణలు జరిగాయి, ప్రస్తుతం ఏ శిక్షణ జరుగుతోంది, ఎంతమంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు, మహిళా ప్రాంగణం సామర్థ్యం తదితర వాటి గురించి ప్రాంగణం జిల్లా మేనేజర్ పైల విమలను ఆమె అడిగి తెలుసుకున్నారు. శ్రద్ధతో నేర్చుకొని స్వయం ఉపాధి పొందగలగాలని శిక్షణ పొందుతున్న మహిళలకు గ్రీష్మ సూచించారు. ప్రాంగణ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి.. లక్ష్యాలు చేరుకోవాలి

గురుకులం విద్యార్థులకు సీపీ సూచన



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, చెడు వ్యసనాలకు, చెడ్డవారితో స్నేహానికి దూరంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లో భాగంగా శనివారం శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థుల తల్లిదండ్రులకు రంగవల్లులు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా సీపీ మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉన్న వారే లక్ష్యాలు చేరుకోగలుగుతారన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల ప్రవర్తనను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ అన్నెపు నర్సింహమూర్తి, ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, గురుకులం విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు ఎట్టకేలకు మోక్షం

నేడు కొత్త భవనం ప్రారంభం




విద్యుద్దీపాల అలంకరణలో ఆరిలోవ పోలీస్ స్టేషన్ నూతన భవనం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు ఎట్టకేలకు మోక్షం కలుగుతోంది. కొన్ని దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఇరుకు స్టేషన్‌కు విముక్తి లభించనుంది. కొత్తగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. విమ్స్ ఆవరణలోని సుమారు ఎకరా స్థలంలో రూ.6 కోట్లతో, ఆధునిక సౌకర్యాలతో ఆరిలోవ పీఎస్ నూతన భవనం నిర్మించారు. ఇందులో హౌస్ ఆఫీసర్(సీఐ), ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలకు ప్రత్యేకంగా చాంబర్లు, రైటర్ రూం, రికార్డులు భద్రపరిచే గదులు, ఆఫీస్ రూం, సిబ్బందికి, ప్రజలకు అవసరమైన వాష్ రూంలు, నిందితుల కోసం పురుషులు, మహిళలకు వేర్వేరుగా కంట్రోల్ రూంలు(లాకప్‌లు), విశ్రాంతి గదులు, రిసెప్షన్ హాల్ తదితర విభాగాలకు ప్రత్యేకంగా గదులు సిద్ధం చేశారు. భవన నిర్మాణంలో సెల్లారుతోపాటు మొదటి అంతస్తులో సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మిగిలిన ఖాళీ స్థలాన్ని పార్కింగ్‌తో పాటు దొంగతనాలకు, రోడ్డు ప్రమాదానికి గురైన వాహనాలు భద్రపరచడానికి కేటాయించారు. సీఐ, ఎస్‌ఐల చాంబర్లలో కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటు చేశారు. నిర్మాణమంతా పూర్తయిన అనంతరం సుమారు నాలుగు నెలలు పాటు ఖాళీగా వదిలేశారు. పాత పోలీస్ స్టేషన్‌లో పని ఒత్తిడి, ఫిర్యాదుదారుల రద్దీ రోజురోజుకూ పెరుగుతుండటంతో కొత్త భవనాన్ని ఆదివారం రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితతో ప్రారంభించడానికి అధికారులు సిద్ధం చేశారు. కొత్త స్టేషన్‌ను విద్యుద్దీపాలు, పూల మాలలతో సుందరంగా అలంకరించారు.

నయనమనోహరంగా నాట్య ప్రదర్శనలు



నాట్యాంజలి కళాకారులతో నాట్య నిపుణుడు సుధీర్‌రావు, నాట్యాచార్య వెంకట్



భరతనాట్య ప్రదర్శనలో కళాకారిణులు

మద్దిలపాలెం: నాట్య కళాక్షేత్రం కళాకారిణుల నృత్య ప్రదర్శనలు నయనమనోహరంగా సాగాయి. సీతమ్మధారకు చెందిన 'నాట్యం' నాట్య కళాక్షేత్ర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 24వ వార్షికోత్సవం శనివారం కళాభారతి ఆడిటోరియంలో వైభవంగా జరిగింది. సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.మాధవి, నాట్యం నిర్వాహకుడు వెంకట్ విద్యార్థులకు చక్కటి తర్ఫీదు ఇచ్చి నాట్యాంజలి పేరిట ఏర్పాటు చేసిన భరతనాట్య బృంద ప్రదర్శనలు తలమానికంగా నిలిచాయి. సంగీత విద్వాంసులచే వాద్యఘోష్టి (లైవ్ మ్యూజిక్) ఈ ప్రదర్శనలకు అదనపు వన్నెలద్దాయి. నిర్వాహకులతోపాటు వరంగల్‌కు చెందిన సుప్రసిద్ధ కూచిపూడి, భరతనాట్య నిపుణుడు, విశిష్ట అతిథి బి.సుధీర్‌రావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాట్యాచార్య కె.వెంకట్ నట్టువాంగ నిర్వహణ ప్రదర్శనకు గాంభీర్యాన్నిచ్చింది. కె.చంద్రరావు గాత్రం, టి.చైతన్య మృదంగం, ఎ. సత్యవిశాల్ వాయులీనం, కుమార్‌బాబు వేణువుపై చక్కటి సంగీత సహకారమందించి నాట్య కచేరీని ఆద్యంతం రక్తి కట్టించారు. కె.రమ సమకూర్చిన ఆహార్యం, డి.రాజేష్ రంగాలంకరణ, పి.వి.రమణమూర్తి వెలుతురు నిర్వహణ, పి.లితీష్ శబ్ద నిర్వహణ అన్నీ చక్కటి సమన్వయంతో సాగాయి. సీతా శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ప్రతిభకు పురస్కారాలు..

సంస్థలో సంగీత, నృత్య శిక్షణ పొందిన వారిలో 2023–24కు గాను అగ్రశ్రేణిలో నిలిచిన కొందరిని ఎంపిక చేసి సత్కరించారు. తెలుగు ఇండియన్ ఐడల్ పోటీలో రన్నరప్‌గా నిలిచిన జి.వి.శ్రీకీర్తి హైదరాబాద్‌గాన గంధర్వ పురస్కారమందుకున్నారు. బహుమతుల ప్రదానంలో డాక్టర్ వెంపటి చినసత్యం కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ హరి రామమూర్తి, ది డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకుడు బత్తిన రంగ విక్రమ్‌కుమార్(గౌడ్), సాంస్కృతిక రంగ ప్రముఖులు కన్నం వెంకటరమణారావు, ఉమ్మిడి మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. విశేష సంఖ్యలో హాజరైన ప్రేక్షకులతో ఆడిటోరియం కళకళలాడింది.

అలరించిన సంగీత కచేరీ

ఏయూక్యాంపస్: తారకేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బీచ్ రోడ్డులోని అన్నమయ్య విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమం నగరవాసులను అలరించింది. ముందుగా డాక్టర్ బి.కనకదుర్గాప్రసాద్ వీణా కచేరీ జరిగింది. కుమారి బి.వీణాధరి వీణపై, మృదంగంపై ఎం.కామేష్ సహకారం అందించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన శౌనక్ మజుందర్ సంతూర్, అనుకల్ప ఘోష్ మాండలీన్, కుమన్ సర్కార్ తబలపై చేసిన జుగల్బంది భారతీయ సంగీత వైభవాన్ని ప్రస్ఫుటం చేసింది. చివరగా కుమారి వేద విద్య నాట్య ప్రదర్శనతో ఆకట్టుకుంది. అణు శాస్త్రవేత్త స్వామి జ్ఞానానంద జీవిత చరిత్రపై ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శన నగరవాసులకు అపారమైన జ్ఞానాన్ని అందించింది. కార్యక్రమాన్ని స్వామి జ్ఞాన ప్రభ సమన్వయం చేశారు.

ప్రభుత్వ బడిలో ఎందుకు చదివించాలి..?

- తోటగరువు హైస్కూల్‌లో అన్నీ సమస్యలే..
- పేరెంట్స్–టీచర్స్ మీట్‌లో ఏకరువు పెట్టిన విద్యార్థుల తల్లిదండ్రులు
- తెల్లమొహం వేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అధికారులు



తోటగరువు జెడ్పీ హైస్కూల్‌లో పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌కు హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు



పాత వెంకోజీపాలెం పాఠశాల వద్ద ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లులు

ఆరిలోవ: కూటమి ప్రభుత్వం మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్ పేరుతో సర్కారు బడుల్లో అట్టహాసంగా ఏర్పాట్లు చేపట్టింది. రెండు రోజుల నుంచి ఉపాధ్యాయులు పాఠశాలల్లో హడావుడి చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం పంపించి సమావేశానికి రప్పించారు. ఇందులో భాగంగా శనివారం ఆరిలోవ తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. దీని కోసం నానా హడావుడి చేసిన ఉపాధ్యాయులు, కూటమి నాయకులకు విద్యార్థుల తల్లిదండ్రులు సమస్యలు, వైఫల్యాలను వివరించి ఝలక్ ఇచ్చారు. ఉదయం 10 గంటలకు పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులతో తరగతుల వారీగా గదుల్లో ఉపాధ్యాయులు సమావేశమై మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత హాజరైన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవురావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, ఉపాధ్యాయులు వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లల చదువులో తల్లిదండ్రులు బాధ్యత వహించాలని సూచించారు. అంతవరకు బాగానే కార్యక్రమం నడిచింది. తమ కూటమి పాలన, నాయకుల సేవలను పొగుడుతారేమోనని ఆశతో తల్లిదండ్రులను స్టేజీ మీదకు వచ్చి మాట్లాడాలని ఎమ్మెల్సీ చిరంజీవిరావు కోరారు. వచ్చిందే అవకాశంగా పేరెంట్స్ మాట్లాడుతూ పాఠశాలలో తమ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరిస్తూ ఏకిపారేశారు. కనీస సదుపాయాలు లేని ప్రభుత్వ బడిలో తమ పిల్లలను ఎందుకు చదివించాలని ప్రశ్నించారు. దీంతో ఎమ్మెల్యే వెలగపూడి, ఎమ్మెల్సీ చిరంజీవి, విద్యా శాఖ ఆర్జేడీ భాస్కరరావు, అధికారులు తెల్లమొహం వేశారు. దీంతో అక్కడే ఉన్న ప్రధానోపాధ్యాయురాలిని ఎమ్మెల్యే స్టేజీ మీదకు పిలిచి మందలించారు. కార్యక్రమంలో పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు ఆటల పోటీలు

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పిల్లల చదువు, పాఠశాలలో సమస్యలు, అభివృద్ధి పనులపై తల్లిదండ్రులు, స్కూల్ కమిటీ సభ్యులు సూచనలు, సలహాలు ఇచ్చారు. చిన్నారుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ వంటి ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ హెచ్‌ఎం సిహెచ్.జ్యోతి, ఉపాధ్యాయులు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, శ్రీ సీతారామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పేరెంట్స్–టీచర్స్ సమావేశాలు

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లు నిర్వహించారు. ఆరిలోవ నుంచి విశాలాక్షినగర్ వరకు ఉన్న అన్ని ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి నుంచి పాఠశాలల అభివృద్ధి కోసం సలహాలు, సూచనలు సేకరించారు. తోటగరువు జెడ్పీ హైస్కూల్‌తోపాటు పైనాపిల్ కాలనీ నుంచి ఆరిలోవ, జోడుగుళ్లపాలెం వరకు గల ప్రాథమిక పాఠశాలల్లో ఈ సమావేశాలు జరిగాయి. పాఠశాలల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులకు వలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మార్గదర్శకులు గురువులు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు కేడీపీఎం పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే.. విద్యా బుద్ధులు నేర్పిన గురువులు జీవితాన్ని ఇస్తారన్నారు. కేడీపీఎం స్కూల్‌లో చదివి ప్రపంచ ప్రఖ్యాత స్పేస్ రీసెర్చ్ సంస్థ ఇస్రోలో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేసి రిటైరైన నాగేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు బాల్యంలోనే గురువుల సూచనలతో లక్ష్యాలు ఏర్పరచుకుని ఆ దిశగా సాగితే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. 500 మార్కులకు పైగా సాధించిన ప్రతి ఒక్క టెన్త్ విద్యార్థికి రూ.5,000 చొప్పున తన సొంత నిధుల నుంచి ప్రతి ఏటా ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, హెచ్‌ఎం ఎన్.సుమతీభాయ్, సహ ప్రధానోపాధ్యాయిని మధుస్మిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి పోతనరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తల్లిదండ్రుల సూచనలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని జీవీఎంసీ స్కూల్‌లో మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్ ఉత్సాహంగా జరిగింది. పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలను 7వ తరగతి స్థాయికి పెంచాలని సూచించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ గొలగాని మంగవేణి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సూచించిన విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌ఎం సురేష్ కుమార్ విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, పాఠశాల కమిటీ చైర్మన్ జరీనా బేగం తదితరులు పాల్గొన్నారు.



కేడీపీఎం పాఠశాలలో విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

భోజనం తింటే కడుపు నొప్పి



తోటగరువు హైస్కూల్‌లో మధ్యాహ్నం పెడుతున్న భోజనం సరిగా ఉడకడం లేదు. దీంతో ఎక్కువ మంది విద్యార్థులకు కడుపు నొప్పి వస్తోంది. అందుకే పిల్లలు భోజనం తినడానికి ఆసక్తి చూపడం లేదు. అన్నం కోసం వినియోగిస్తున్న బియ్యం మార్చేసి సన్న బియ్యం వాడాలని మేమంతా కోరుతున్నాం.

–సత్యారాలు, పాఠశాల పేరెంట్ కమిటీ, ఆరిలోవ

ఎన్నో సమస్యలున్నాయి



తోటగరువు జెడ్పీ హైస్కూల్‌లో ఎన్నో సమస్యలున్నాయి. పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం లేదు. వాటిలో నీరు అందుబాటులో ఉంచడం లేదు. విద్యార్థులే బోరు వద్ద నీరు కొట్టి బక్కెట్లతో మోసుకెళ్లాల్సి వస్తోంది. విద్యార్థులు ఇంటి నుంచి బాటిల్‌తో తీసుకెళ్తున్న నీటిని ఉపాధ్యాయులు తాగనీయడం లేదట. దీని వల్ల ఆడపిల్లలకు పొట్టలో ఇన్‌ఫెక్షన్లు వస్తున్నాయి. తరగతి గదులను ఆయాలు తుడవటం లేదు. విద్యార్థులే రోజూ శుభ్రం చేసుకుంటున్నారు. మధ్యాహ్న భోజనం బాగా వండటం లేదు. గుడ్లు సరిగా ఉడకబెట్టకపోవడంతో పిల్లలు తినలేకపోతున్నారు. నేను మా పిల్లలతోపాటు మరి కొంత మందిని అడిగాను. వారంతా ఇవే సమస్యలు చెబుతున్నారు. పాఠశాల నుంచి ఇంటికొచ్చే సరికి కూలి పనులు చేసి వచ్చినట్లు విద్యార్థుల దుస్తులు తయారవుతున్నాయి.

–రాధ, విద్యార్థి తల్లి, ఆరిలోవ

గ్రోత్ స్టోరీస్ అవార్డుల సమ్మిట్

ఏయూక్యాంపస్: గ్రోత్ స్టోరీస్ సమ్మిట్–అవార్డులు 2024 కార్యక్రమం శనివారం బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యాగజైన్ ఎడిషన్‌ను ఆవిష్కరించారు. దీనిలో పలు రంగాలకు చెందిన 30 కంపెనీలు, వ్యవస్థాపకుల విజయ గాథలను పొందుపరిచారు. విశాఖలో రూపొందించిన ఎలక్ట్రికల్ స్కూటర్ ధరిత్రి బోను కస్టమ్స్, జీఎస్‌టీ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.శ్రీదత్, ధరిత్రి బ్రో సీఈవో డి.విజయ్ భరత్ ప్రారంభించారు. స్టార్టప్ కంపెనీల సీఈవోలను ప్రోత్సాహక అవార్డులతో సత్కరించారు. ది సీ కనెక్ట్ వ్యవస్థాపకులు రామాంజనేయ సాగి, నిఖిలేష్ కాలిదాసు, చిన్నా బొట్ల తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలతో నింపేశారు..



ఆంధ్రా యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన అలుమ్ని మీట్‌కు మంత్రి నారా లోకేష్ వచ్చిన సందర్భంగా ఏయూలోని వైఎస్సార్ విగ్రహానికి అడ్డంగా చుట్టూ ఫ్లెక్సీలు కట్టారు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం